క్లుప్తంగా

నేడు నీటి సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరం, బళ్లారి రోడ్డులో టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో పైపులైన్ పగిలిపోయినందున బుధవారం పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఉండదని నగరపాలక కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. బండికనుమ నుంచి కడపకు నీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పోయిందని, మరమ్మతులు చేయడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఫలితంగా సాయిపేట, ఆగాడి, అక్కాయపల్లె, చెమ్ముమియ్యాపేట, రవీంద్రనగర్, నబీకోట, విజయదుర్గా కాలనీ, లోహియా నగర్ ప్రాంతాలకు తాత్కాలికంగా నీటి సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

దోష నివారణ పూజలు


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్: కడప విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు దోష నివారణకు మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక రాహుకాల పూజలు నిర్వహించారు. ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకూ అమ్మవారికి చతుష్షష్టి ఉపచార పూజలు నిర్వహించనున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప కల్చరల్ : కడప శిల్పారామం క్యాలెండర్లను ఎమ్మెల్యే మాధవీరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఏటా ఉగాది పండగ సందర్భంగా రాష్ట్ర శిల్పారామాల విభాగం క్యాలెండర్లను ప్రచురించి సంబంధిత జిల్లాలకు పంపిణీ చేస్తుంది. అందులో భాగంగా విశ్వావసు నామ సంవత్సర శిల్పారామం క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ ఛైర్మన్‌కు సన్మానం


జెడ్పీ ఛైర్మన్ రామగోవిందరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: నూతన జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎం.రామగోవిందరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం కడపలోని ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, జీపీ.శంకర్‌రెడ్డి, ఏవీ.సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అయ్యవారురెడ్డి, సుబ్బిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప అర్బన్: హిమ వర్షిణి ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు గోగు వెంకటసురేష్‌బాబు సతీమణి మంజులవాణి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు పవన్ కుమార్, సాయి మనోజ్ నిరాశ్రయుల నివాస వసతి గృహంలో వృద్ధులకు మంగళవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ విజయలక్ష్మి, గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

కడప కల్చరల్: రంజాన్ పండగ సందర్భంగా మంగళవారం కడప శిల్పా రామం సందర్శకులతో సందడిగా కనిపించింది. సాయంత్రం కళావేదికపై పులివెందులకు చెందిన ఎస్కే డాన్స్ అకాడమీ, కడప నగరానికి చెందిన అఖిల్ డాన్స్ అకాడమీ చిన్నారులు నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్ బాబు పర్యవేక్షించారు.

నేడు ఉర్దూ కవి సమ్మేళనం


మాట్లాడుతున్న అఫ్జల్ ఖాన్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బజ్మెజకి, అమీరున్నిసా విద్యా సంస్థ సంయుక్తంగా బుధవారం నిర్వహించే సాయంత్రం జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనం, ఉర్దూ కవి సయీద్ నజర్ పుస్తకావిష్కరణ జయప్రదం చేయాలని నగర ముస్లిం ప్రముఖుడు అఫ్జల్ ఖాన్ కోరారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని రవీంద్రనగర్ యూఎస్ కళ్యాణమండపంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, విశ్రాంత వీసీ ముజఫ్ఫర్ షమీరీ అబ్దుల్ హక్, విశ్రాంత ఉర్దూ ఆచార్య ఖాసీం అలీఖాన్ హాజరవుతున్నట్లు తెలిపారు. కడపకు చెందిన 16 మంది ఉర్దూ కవులతో పాటు వివిధ రాష్ట్రాల ప్రముఖ కవులను సన్మానిస్తున్నట్లు ఆయన తెలిపారు. కవి, రచయిత సయీద్ నజర్ వ్యక్తిత్వం, సాహితీ సేవలు అంశంపై ఆరుగురు ఉర్దూ సాహితీ పరిశోధకులు పరిశోధన పత్రాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, ఉర్దూ సాహితీ ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిల్లలతో కథలు చదివిద్దాం

నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

కడప కల్చరల్: అమ్మ ఒడి మానవుడికి తొలి బడి అన్నది నానుడి. తెల్ల కాగితం లాంటి చిన్నారులను విజ్ఞాన వంతులుగా తీర్చి ఉత్తమపౌరులుగా దేశానికి అందిస్తుంది అమ్మ. అవ్వా తాతలు మరింత తోడ్పాటునందిస్తారు. ప్రస్తుతం సమాజంలో ఆ పరిస్థితి లేదు. పాఠ్య పుస్తకాలు మినహా సాధారణ పుస్తకాలు చదివే అలవాటు కనిపించడంలేదు. నేడు ప్రతి తల్లి తమ చిన్నారులకు పెరుగన్నంలో కథలు కలిపి తినిపించాల్సిన అవసరం కనిపిస్తోంది. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితుల గురించి...


గ్రంథాలయంలో చదువుకుంటున్న చిన్నారులు (ఫైల్)

బాలలకోసం ప్రత్యేక కథలు

పాఠ్య పుస్తకాలు మినహా ఇతర పుస్తకాలు చదివే అవకాశం ప్రస్తుతం తగ్గింది. అరకొర పుస్తకాలున్న గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు చదివేందుకు వచ్చే వారే ఎక్కువ. జిల్లాలోనూ ఇదే పరిస్థితి. జిల్లాలో కవులు ఎక్కువ గనుక కవిత్వం, కథలు, వ్యాసాల పుస్తకాలు ఏటా 10 నుంచి 20 దాకా వెలువడుతున్నాయి. ఇందులో కథల పుస్తకాలు ఉన్నాయి. జిల్లాలోని కొందరు రచయితలు చందమామ నాటి నుంచి నేటి వరకు బాలల కోసం ప్రత్యేకంగా కథలు వెలువరిస్తున్నారు.

చందమామ నుంచి...

దేశంలో బాల సాహిత్యంలో నెంబర్‌వన్‌గా నిలిచిన చందమామ పత్రిక యజమానులు జిల్లాకు చెందిన వారేనన్న విషయం నేటితరంలో చాలామందికి తెలియదు. ఈ పుస్తకానికి అప్పట్లో ఎనలేని పేరుండేది. ప్రస్తుతం బాలసాహిత్యం కోసం పత్రికలు కనిపించడం లేదు. రాస్తున్న వారిలో ఎల్‌ఐసీ ఉద్యోగిరెడ్డినాగరాజు, పవన్‌కుమార్ మాత్రమే ఉండేవారు. అంతకుముందు రాజంపేటకు చెందిన గుండ్రాతి విజయ్ కుమార్, కడపకు చెందిన రామరాజులు చందమామలో కథలు రాసేవారు. నేడు జిల్లాలో ఆ ఒరవడి కొనసాగుతూనే ఉంది. ప్రొద్దుటూరుకు చెందిన ఉపాధ్యాయుడు చదువులబాబు వందలాది కథలు రాస్తూ బాల సాహిత్యం విభాగంలో దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని సాధించారు. దీంతో బాల సాహిత్య విభాగంలో జిల్లా పేరు మరోసారి తళుక్కుమంది. ఆయన నేటికీ ఈ సాహితీ జైత్రయాత్రను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు కథలు రాయడం నేర్పుతున్నారు. పదేళ్ల క్రితం జన విజ్ఞాన వేదిక జిల్లాశాఖ ప్రతినిధులు కేవలం పాఠశాల విద్యార్థులు రాసిన వందలాది కథలతో కడప పిల్లోళ్ల కథలు పేరిట ప్రత్యేకంగా పుస్తకాన్ని వెలువరించడం విశేషం. బాల సాహిత్యానికి సంబంధించి కడపకు ఇంతటి ఘన చరిత్ర ఉంది. భవిష్యత్తులో కూడా కొనసాగుతుందన్న ఆశ కూడా ఉంది.


పిల్లలకు సంబంధించిన పుస్తకాలు

చదవడం ఇష్టంగా...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రమంతటా బాలల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయాలో చదవడం మా కిష్టం పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వేసవి సెలవుల్లో మరింత అభివృద్ధి చేసి నెల రోజులపాటు పిల్లలకు గ్రంథాలయాలకు వెళ్లడం, పుస్తకాలు చదవడం అలవాటు చేసేందుకు ఎంతో కృషి చేశారు. దాంతో గ్రంథాలయాలు చిన్నారులతో మళ్లీ కళకళలాడాయి. పుస్తకాలను విరివిగా బాలలకు అందుబాటులో ఉంచగలిగినపుడే తిరిగి వారిని పుస్తకం వైపు మళ్లించవచ్చని విజ్ఞులు పేర్కొంటున్నారు. పుస్తకాలు చదివితేగానీ విజ్ఞానం అభివృద్ధి అయ్యే అవకాశం ఉండదని, ఈ ప్రతికూల పరిస్థితిని చక్కదిద్దేందుకు తల్లిదండ్రులు, మేధావులతోపాటు ప్రభుత్వం కూడా ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉంది.

పూడిక నిండి.. ఇళ్లలోకి మురుగు

కడప కార్పొరేషన్: పర్యవేక్షణ లేక.. సిబ్బంది పట్టించుకోక వీధుల్లో మురుగు పరుగుతీస్తోంది. కడప నగరంలోని ప్రొఫెసర్స్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ ఏ వీధిలోనూ సీసీ కాలువలు లేకపోవడం, కచ్చా కాలువల ద్వారానే నీటి ప్రవాహం జరగాల్సి ఉన్నందున ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ప్రొఫెసర్స్ కాలనీలో చిన్న కాలువల్లోని మురికినీరంతా మెయిన్ రోడ్డులోని ప్రధాన కాలువలోకి వెళ్లాల్సి ఉంది. అయితే కచ్చా కాలువ ఉండడంతో మురికినీరంతా ప్రక్కనున్న ఖాళీ జాగాలోకి వెళ్తోంది. ప్రస్తుతం ఆ స్థల యజమానులు అందులో ఇంటి నిర్మాణం చేస్తూ మురికి నీరు తమ జాగాలోకి రాకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో పిల్ల కాలువల్లో పోయే మార్గం లేక నీరు అలాగే నిలిచిపోయింది. కాలువల్లో పొంగి ప్రక్కనున్న ఇళ్లలోకి చేరుతోంది. డోర్ నంబర్ 99/257 వద్ద డ్రైనేజీ తీవ్రత ఎక్కువగా ఉంది. మురికి నీరు ఇళ్ల ఎదుట నిలిచి ఉండడంతో సాయంత్రమైతే దోమలు, ఈగలు, పురుగులు రావడమేగాక, దుర్గంధం వెదజల్లుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక ఉన్నతాధికారులు స్పందించి మురికి నీరు ఇళ్లలోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పూడికతో నిండిన కాలువలు

ఇళ్లలోకి మురుగు నీరు చేరుతోంది



గతంలో పిల్ల కాలువల్లోని నీరంతా ఖాళీ జాగాలోకి వెళ్లేది. ఇప్పుడు ఇంటి నిర్మాణం చేపట్టి మురికినీరు అందులో ప్రవేశించకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ఇళ్లలోకి డ్రైనేజీ నీరు వస్తోంది. దీనివల్ల దోమలు ఎక్కువై జ్వరాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి. – ఎం. రామయ్య, ప్రొఫెసర్స్ కాలనీ

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

కడప కల్చరల్: జిల్లా దేవదాయశాఖ పరిధిలో ఈఓగా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన చలపతిని అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. కడప నగరంలోని అసిస్టెంట్‌కమిషనర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏసీ మాట్లాడుతూ నందిమండలం గంగమ్మ దేవత ఆలయ ఈవోగా చలపతి సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణమ్మ, జనార్ధన్, శివయ్య, శ్రీధర్, సురేష్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు రమణారెడ్డి, శ్రావణ్, మునికుమార్, తదితరులు పాల్గొన్నారు.


చలపతిని సత్కరిస్తున్న మల్లికార్జునప్రసాద్

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తే గుర్తింపు

జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్

కడప అర్బన్: బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించిన వారికి పదవీ విరమణ పొందినా గుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ అన్నారు. నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇటీవల పదవీ విరమణ పొందిన పి.రాముడు, ఆర్.రాముడు, జి.చంద్రశేఖర్లను ఎస్పీ, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటినుంచి ఇప్పటివరకూ శాంతి భద్రతల పరిరక్షణకు సేవలందిస్తూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. పదవీ విరమణ పొందినవారంతా ఆ తర్వాత కూడా పోలీస్ కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీస్ శాఖ తోడుగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ బి.రమణయ్య, సిబ్బంది టైటస్, వీరేష్, శివరాముడు, జ్యోతి, దూలం సురేష్, ఉప్పుశంకర్ పాల్గొన్నారు.


పోలీసు అధికారులతో ఎస్పీ అశోక్‌కుమార్

ఎన్‌జీవో కాలనీలకు కలుషిత నీటి సరఫరా

కడప కార్పొరేషన్: తమకు మంగళవారం కలుషిత నీరు సరఫరా అయినట్లు కడప నగరం తొమ్మిదో డివిజన్‌లోని ఎన్‌జీవో కాలనీ వాసులు తెలిపారు. స్థానికులు కట్టా రమేష్, కాశీజీరావు ఆధ్వర్యంలో మహిళలు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రను మంగళవారం కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌జీవో కాలనీలోని మోర్ మార్కెట్ ఎదురుగా ఉన్న కల్వర్టు పగులగొట్టడంతో బురద నీరు సరఫరా అవుతోందన్నారు. నగరపాలక అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీ రాకేష్ చంద్ర జోక్యం చేసుకుంటూ కాంట్రాక్టర్‌ను వివరణ కోరారు. పైపులైన్‌ను పునరుద్ధరించే వరకూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.


ఎన్‌జీవో కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఏసీ రాకేష్ చంద్ర

పది పరీక్ష ముగిసిందోచ్

ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా బయటకు వచ్చారు. ఇన్నాళ్లు కష్టపడి చదివిన విద్యార్థులు... పరీక్షలు అయిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షలు బాగా రాశామని, అధిక మార్కులతో పాసవుతామని వారి ఉపాధ్యాయులతో చెబుతున్నారు. అనంతరం పరీక్ష కేంద్రం వద్దే కాసేపు తమ మిత్రులతో కలిసి ఆనందంగా గడిపారు. పరీక్ష ఎలా రాశావని ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ ఎక్కడ చేరేది, ఏ గ్రూపు తీసుకునేది, ఎండాకాలం సెలవుల్లో కోచింగ్ తీసుకుందామా అనే విషయాలు మాట్లాడుకున్నారు. ఇక విడిపోతున్నామంటూ ఇదే చివరి కలయిక అని చెప్పుకుంటూ మరి ఎప్పుడు కలుస్తామోనని బాధతో టాటా... బాయ్ బాయ్ చెప్పుకుంటూ వెళ్లారు. వేసవి సెలవులను వృథా చేయకుండా కోటి ఆశయాలతో భవిష్యత్తు బాటలోకి అడుగులు వేస్తామని, అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని వారు చెబుతున్నారు. నగరంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు సందడి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్


హమ్మయ్యా పరీక్షలు రాసేశాం..


ఉత్సాహంగా వస్తున్న విద్యార్థులు



ఓకే...బాయ్...ఇంటర్‌లో కలుద్దాం


పరీక్ష ఎలా రాశావ్... ఇక వెళ్దామా


మళ్లీ ఎప్పుడు కలుస్తామో...

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల రిటైర్మెంట్ వయసు పెంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, ఆప్కాస్ ఉద్యోగులు, సిబ్బంది, ఎన్‌ఆర్‌ఎంలకు ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా, నగర అధ్యక్షుడు వీరమల్లు నరసింహులు కోరారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతామన్న ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నించారు. 2024 జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సమ్మె సందర్భంగా డిమాండ్ చేశామన్నారు. ప్రభుత్వం అపుడు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా

రామాయణ పఠనంతో జన్మ సార్థకం

కడప కల్చరల్: మహా కావ్యమైన రామయణాన్ని చదవడం, వినడం ద్వారా జన్మ సార్థకమవుతుందని ప్రొద్దుటూరుకు చెందిన స్వామిని శివ దర్శనానందరం సరస్వతీతీ మాత అన్నారు. కడప హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో ఉగాది నుంచి జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా రామాయణంపై ఆమె వారం రోజుల పాటు ప్రవచించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామాయణ రచనతో రత్నాకరుడైన ఆటవికుడు వాల్మీకి మహర్షిగా మారాడని తెలిపారు. ఈ రచన వల్ల ఆయన గొప్ప జ్ఞాపికగా, తాత్వికుడిగా, తపస్విగా, మహర్షిగా పేరు గాంచారని వివరించారు. రామాయణాన్ని ఎందరో మహానుభావులు సంపూర్ణంగా అధ్యయనం చేసి మోక్షం పొందారన్నారు. ఈ సందర్భంగా తొలుత ఆలయ నిర్వాహకులు దేశు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మూలమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శేష వాహనంపై స్వామిని కొలువుదీర్చి ఊంజల్ సేవ చేశారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అభిరుచికి తగ్గట్టు.. పేరుతో ఆకట్టు



బైపాస్‌రోడ్డులోని ఓ హోటల్ బోర్డు



జిల్లా కోర్టు ఎదురుగా ఓ హోటల్ పేరు ఇలా..



ఆఫీసర్స్ క్లబ్ ఎదురుగానున్న హోటల్‌లో..



హిమాలయ ఆస్పత్రి వద్దనున్న హోటల్

పేరంటే ఎవరైనా పెడతారు. కానీ, అది అందరి దృష్టిని ఆకట్టుకోవాలనే ప్రయత్నం మాత్రం తక్కువ మందే చేస్తారు. ×అరె.. బాగుందే¥ అని పదిమంది అనుకుంటేనే పేరొచ్చినట్లు. ఇదంతా దేనికోసమని అనుకుంటున్నారా?.. ఇదంతా పేర్ల కోసమే. ప్రస్తుతం హోటళ్లు, రెస్టారెంట్లు భిన్నమైన పేర్లతో ఆకర్షిస్తున్నాయి. మార్కెట్ దృష్టిని కట్టిపడేస్తున్నాయి. ఆహారప్రియుల మదిని దోస్తున్నాయి. హోటళ్ల యజమానులు మారుతున్న కాలానికి అనుగుణంగా చదవగానే ఇట్టే గుర్తిండేలా పేర్లు పెట్టారు.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి

వల్లూరు : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి రవి బాబు తెలిపారు. వల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సచివాలయాల ఏఎన్‌ఎంలకు మంగళవారం జరిగిన నెలవారీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీడీ, క్యాన్సర్, డెంటల్, పీఎంజేవై, సికిల్ సన్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సర్వేను పూర్తి చేయాలన్నారు. టీబీ, లెప్రసీ కేసులకు సంబంధించి పాపులేషన్‌కు తగినట్లు సర్వే చేయాలన్నారు. పీహెచ్‌సీలో జరుగుతున్న కాన్పులు, సేవలను గురించి ఆరా తీశారు. అనుమానాస్పద కేసులను రెఫర్ చేయాలని సూచించారు. ఎండాకాలంలో వచ్చే విరేచనాలు, డెంగీ వంటి వ్యాధుల గురించి వివరించారు. గర్భిణలకు, బాలింతలకు, పిల్లలకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సరైన సేవలు అందించాలని తెలిపారు. సకాలంలో గర్భిణుల వివరాలను నమోదు చేసి, వారికి టీటీ, ఐరన్ టాబ్లెట్లు ఇవ్వడమే కాక 4 హెల్త్ చెకప్స్ పూర్తి చేయించాలని, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో ఇవ్వాలని ఆదేశించారు. ఐరన్, విటమిన్ ఏ సరఫరా చేయాలని సూచించారు. ప్రతి గర్భిణికి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయ్యేలా వారికి అవగాహన కల్పించడంతో పాటు 108 సేవలు గురించి, 102 సేవలు గురించి వివరించాలని సూచించారు. చిన్నపిల్లలకు ఎండాకాలంలో తట్టు, అమ్మవారు, విరోచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు వుంటాయని, వాటిపై అవగాహన కల్పించాలన్నారు. పనులకు పోయే వాళ్లు ఎండాకాలంలో 10 గంటల లోపల పనులు ముగించుకుని నీడ పాటు చేరాల్సిన అవసరాన్ని వివరించాలన్నారు. ఆశా వర్కర్ల వద్ద, అంగన్‌వాడీ సెంటర్స్, స్కూల్స్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా

కడప అర్బన్: జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు అధికారులు మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూవాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు . కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. ఉల్లంఘనులపై పోలీసులు చర్యలు చేపట్టారు.